క్లుప్తంగా

ఇందిరమ్మ రాజ్యంలోనే అభివృద్ధి



ఇందిరమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

పెద్దేముల్: దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హయాంలోనే పల్లెలు అభివృద్ధి చెందాయని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాని, జిల్లా నాయకులు ఎల్లారెడ్డి, మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్, మినాజ్, పెంటప్ప, చందు పాల్గొన్నారు.

ఆనంద్‌ను గెలిపించండి



ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు

మర్పల్లి: ప్రజా సంక్షేమం కోసం పాటుపడే ఎమ్మెల్యే ఆనంద్‌ను మరోసారి ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు యాదవరెడ్డి, శాంతప్ప రఘుపతిరెడ్డిలు కోరారు. ఆదివారం మర్పల్లి దామస్తాపూర్ గ్రామంలో అధికార పార్టీ తరఫున ఇంటింటి ప్రచారం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఓటర్లకు వివరించారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మరాదని, కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధిని ఆస్వాదించాలని కోరారు.

కపిలేశ్వరుడికి రుద్రాభిషేకం

ధారూరు: మండల కేంద్రం వీరభద్రేశ్వర స్వామి దేవాలయంలో నెలకొన్న కపిలేశ్వరస్వామికి ఆదివారం వికారాబాద్, ధారూరు పట్టణాలకు చెందిన శివస్వాములు రుద్రాభిషేకం చేశారు. పూజారి చెన్నబసవయ్యస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శివస్వాములు తొలుత ప్రథమ పూజ్యుడు గణపతికి తర్వాత కపిలేశ్వరునికి జలాభిషేకం, పాలాభిషేకం, పంచామృతంతో అభిషేకం చేశారు. శివలింగాన్ని వస్త్రం, పుష్పాలతో అలంకరించి, నైవేద్యం సమర్పించారు.

కేటీఆర్‌ను విమర్శిస్తే సహించం

వికారాబాద్ అర్బన్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను విమర్శిస్తే సహించేది లేదని ఆ పార్టీ నాయకుడు శ్రీకాంత్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్ కుమార్.. కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ మంత్రి అయి ఉండికూడా భాషను అదుపులో పెట్టుకోలేక పోయారని మండిపడ్డారు. ప్రజలంతా బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని, తమ నాయకున్ని విమర్శిస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్: ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 21న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ తెలిపారు. అంధత్వ నియంత్రణ సంస్థ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు కంటి పరీక్షలు చేయనున్నామని, నేత్ర సమస్య ఉన్న వారు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని సూచించారు.

పథకాల పేరుతో పచ్చిమోసం

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- మాయ మాటలతో పబ్బం గడిపిన బీఆర్‌ఎస్
- కాంగ్రెస్ వస్తేనే అందరికీ మేలు
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు



మర్పల్లి: పార్టీలో చేరిన వారితో ప్రసాద్‌కుమార్

ధారూరు: సంక్షేమ పథకాల పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. రాష్ట్ర ప్రజలను పచ్చిమోసం చేసిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు ఆదివారం ధారూరు మండలం లక్ష్మీనగర్ తండా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆరు గ్యారంటీ పథకాల గురించి ఓటర్లకు వివరించారు. అనంతరం మాట్లాడారు. గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్‌ఎస్ విఫలం అయిందని విమర్శించారు. డబుల్ బెడ్‌రూం పథకం పేరిట పబ్బం గడిపిందే కానీ.. ఎవరికీ ఇవ్వలేదని, గృహలక్ష్మి ప్రకటించి, ఎన్నికలు వచ్చాయంటూ మెలికపెట్టిందన్నారు. రైతుబంధు పేరిట రైతులకు ఎకరాకు రూ.10వేలు అందజేస్తూ.. వ్యవసాయ యంత్రాలు, విత్తనాలు, ఎరువులపై రాయితీలు ఎత్తేసి రూ.లక్షల కోట్లు మిగుల్చుకుందన్నారు. మాట నిలుపుకోని ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వస్తేనే అందరికీ మేలని, చేతి గుర్తుకు ఓటేసి, కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో పార్టీ జిల్లా, మండల నాయకులు బుజ్జయ్యగౌడ్, మహ్మద్ బాబాఖాన్, లింగనపల్లి అశోక్, ఇబ్రహీం, మల్లేశం, కిరణ్‌కుమార్, ఇనాయతుల్లాఖాన్, రాజేశ్వర్, అబ్బాస్, మల్లికార్జున్, మోసిన్ అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోకు ఆకర్షితులై..

మర్పల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మాజీ మంత్రి, వికారాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మండల పరిధి నర్సాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఫారుక్, అఖిల్, ఇస్మాయిల్, రాజ, దాండ్‌పాష, దీక్షిత్, శ్రీకాంత్, జమీర్‌పాష కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. పార్టీ మేనిఫెస్టో నచ్చే పార్టీలో చేరారన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే భూములు అమ్మేస్తారు

వికారాబాద్ అర్బన్: బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే.. ప్రభుత్వ భూములను అమ్మేస్తుందని, వచ్చే తరాలకు కనీసం ప్రభుత్వ పాఠశాలలు, దవాఖానలు కట్టుకునేందుకు స్థలం కూడా ఉండదని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల ఆరోపించారు. ఇంటింటికి ప్రచారంలో భాగంగా పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలంపల్లిలోని పలువార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలు అమల్లోకి వస్తాయని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు, ప్రతి గృహిణికి నెలకు రూ.2వేల ఆర్థిక సహాయం అందుతుందన్నారు. పార్టీ సంక్షేమ పథకాలు అందాలంటే చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, స్థానిక నాయకులు అబ్దుల్ ఖాలెద్, ఆనంద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మా నాన్నను గెలిపించండి..

బంట్వారం: ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసే మా నాన్నను ఆశీర్వదించి, భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ కూతురు అనన్య చేతన్ కోరారు. కోట్‌పల్లి మండలం జిన్నారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి ఆరు గ్యారంటీ స్కీంల గురించి వివరించారు. పార్టీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోతో పాటు, గ్యారంటీ పథకాలు అమలవుతాయని, పేదల బతుకులు బాగుపడుతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, జిన్నారం సర్పంచ్ వెంకటేశం, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి నర్సింహారెడ్డి, నాయకులు అక్బర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



అనన్యకు బొట్టు పెడుతున్న గ్రామస్తులు

రోహిత్‌రెడ్డి విజయం ఖాయం

- ముదిరాజ్ సంఘం నాయకులు



యాలాల: సభకు తరలిన ముదిరాజ్‌లు

యాలాల: ఎమ్మెల్యేగా రెండోసారి రోహిత్‌రెడ్డి గెలవడం ఖాయమని, ముదిరాజ్‌ల అభివృద్ధికి బీఆర్‌ఎస్ పార్టీ కట్టుబడి ఉందని ముదిరాజ్ సంఘం మండల ఉపాధ్యక్షుడు నర్సింహులు, చేపల సంఘం యాలాల అధ్యక్షుడు అశోక్ అన్నారు. తాండూరు పట్టణంలో ఆదివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముదిరాజ్ ఆత్మీయ సభకు వెళ్తున్న నాయకులకు ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. సభకు వెళ్లిన వారిలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అనంతయ్య, ఏఎంసీ డైరెక్టర్ మంత్రి వెంకటయ్య, లాలప్ప ఉన్నారు.

సంఘం అభివృద్ధికి కృషి

పెద్దేముల్: ముదిరాజ్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఆ సంఘం మండల అధ్యక్షుడు బోయిని మల్లప్ప అన్నారు. తాండూరు పట్టణంలో జరిగిన ముదిరాజ్ ఐక్య వేదికకు పెద్ద ఎత్తున వెళ్లగా.. వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంబాపూర్ ఉప సర్పంచ్ వెంకటయ్య, దుగ్గాపూర్ ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నారాయణ, సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తా..



ప్రచారం చేస్తున్న మనోహర్‌రెడ్డి

- తాండూరు అభివృద్ధికి ఎనలేని కృషి
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి

యాలాల: 'నా రాజకీయ జీవితంలో అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజాసేవ చేశాను. అవకాశం ఇస్తే నిస్వార్థంగా సేవ చేసుకుంటాను. ఒక్క అవకాశం ఇచ్చి చూడండి' అని కాంగ్రెస్ పార్టీ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పేర్కంపల్లితండా, పేర్కంపల్లి, ఎన్కెపల్లి, మల్‌రెడ్డిపల్లి, అగ్గనూరు, బెన్నూరు, జక్కేపల్లి, ముకుందాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పేద, మధ్య తరగతి వారిదని, అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. స్థానికుడిగా గుర్తింపు ఉందని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ నేతలు సంపత్‌కుమార్, హన్మంతు, మహిపాల్, రాకేష్, బీసీసెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప, అగ్గనూరు ఎంపీటీసీ గరివప్ప, నాయకులు వీరేశం, రఘు, ఎన్కెపల్లి రవి, చంద్రారెడ్డి ఉన్నారు.

బీసీ బిడ్డకు అవకాశం ఇవ్వండి

- బీజేపీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి కిరణ్



తిర్మలాపూర్‌లో ప్రచారం చేస్తున్న నేతలు

కుల్కచర్ల: కమలం గుర్తుకు ఓటేసి బహుజనవాదాన్ని, బీసీల ఐక్యతను చాటే సమయం ఆసన్నమైందని బీజేపీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి మారుతి కిరణ్ భూనేటి అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండలం తిర్మలాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజనులు, బీసీలు నేటికీ ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే బీసీ బిడ్డనైన తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఒక జాతీయ పార్టీ ఆధ్వర్యంలో బీసీ బిడ్డగా మీ ముందుకు వస్తున్నానని, ఒక్కసారి అవకాశం ఇస్తే బీసీలకు న్యాయం జరిగేలా చూస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్, నాయకులు బాలయ్య, రాఘవేందర్ గౌడ్, చంద్రలింగం, కృష్ణయ్య పాల్గొన్నారు.

మేనిఫెస్టోకు ఆకర్షితులై చేరికలు

- కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్



బొంరాస్‌పేట: పార్టీలో చేరిన వారితో రేవంత్



కొడంగల్: ప్రచారం చేస్తున్న జగదీశ్వర్‌రెడ్డి

బొంరాస్‌పేట: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి భారీగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధి ఏర్పుమళ్లకు చెందిన పలువురు హైదరాబాద్‌లోని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్‌లో చేరగా.. వారికి రేవంత్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో లోడు, అంజిలప్ప, రమేష్, జంతంగ అబ్బులప్ప, శేఖర్, నాగరాజుగౌడ్, ఐస్వయ్య, అంజిలయ్య ఉన్నారు. ఇందులో ఉప సర్పంచ్ ఎల్లయ్యగౌడ్, నాయకులు అంజిల్‌రెడ్డి ఉన్నారు.

జోరుగా ప్రచారం..

కొడంగల్: రేవంత్‌రెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, రేవంత్ సోదరుడు కృష్ణారెడ్డి అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

'హస్తం'వైపు యువత మొగ్గు

- రాష్ట్రంలో మార్పును కోరుతున్న ప్రజలు: రామ్మోహన్‌రెడ్డి



పరిగి: పార్టీలో చేరిన వారితో రామ్మోహన్‌రెడ్డి

పరిగి: యువత మొత్తం కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని, ప్రజలు తెలంగాణలో మార్పును కోరుకుంటున్నారని కాంగ్రెస్ పరిగి అసెంబ్లీ అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మాజీ జెడ్పీటీసీ బాబయ్య, రాపోల్ గ్రామ యువకులు టీఆర్‌ఆర్‌ సమక్షంలో పార్టీలో చేరగా.. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇతర పార్టీల నుంచి వస్తున్న వారికి కాంగ్రెస్‌లో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసి, పార్టీని గెలిపించుకోవాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవర్ధన్ ఉన్నారు.

పేదల స్వప్నం మేనిఫెస్టో

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో పేదల స్వప్నానికి దగ్గరగా ఉందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు మేనిఫెస్టోలో నిరుద్యోగులకు నిరుద్యోగభృతి, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, పాత పింఛన్ విధానం అమలు, విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను రూపొందించారని చెప్పారు. కార్యక్రమంలో బ్లాకు అధ్యక్షుడు భరత్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్, నాయకులు మొగులయ్య, స్వామి, రాంచంద్రయ్య, కృష్ణయ్య, జలీల్, శివానందు, ఎల్లయ్య, బాలకృష్ణ, మురళి, భాను పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

దోమ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందజేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. మండల పరిధి పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ ప్రకటించిన గ్యారంటీలు ప్రజలకు మేలు చేస్తాయన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి రోజులు దగ్గర పడ్డాయని, సంక్షేమ పథకాల పేరుతో మభ్య పెట్టాలని చూస్తే ప్రజలు సహించరని. కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



దోమ: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



కుల్కచర్ల: మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

ఉద్యమకారుల ఉసురు తీసిన బీఆర్‌ఎస్

కాంగ్రెస్‌ను గెలిపించాలి: టీజేఎస్



ప్రచారం చేస్తున్న సోమశేఖర్

తాండూరు టౌన్: ఉద్యమకారుల ఉసురు తీసిన బీఆర్‌ఎస్ పార్టీని ఓడించాలని టీజేఎస్ నియోజకవర్గ కన్వీనర్, కౌన్సిలర్ సోమశేఖర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ జన సమితి మద్దతు ప్రకటించిందని, అందుకే ప్రచారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలకు నిలయంగా ప్రభుత్వం మారిందని, ఉద్యమ ద్రోహులను అందలమెక్కించి, అమరవీరులను, వారి కుటుంబాలను అవమానించిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీంలతో పాటు, మేనిఫెస్టోలో అన్ని వర్గాలకు చేయూతనిచ్చే అంశాలను పొందుపరిచిందని, కావున ప్రజలు చేతి గుర్తుకు ఓటువేసి తాండూరు అభ్యర్థి బుయ్యని మనోహర్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

అయ్యప్పలకు అన్నదానం

షాద్‌నగర్: పట్టణంలోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో ఆదివారం అయ్యప్ప భక్త సమాజం వారి ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

జేపీ నడ్డాకు స్వాగతం



నడ్డాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవి

శంకర్‌పల్లి: రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభకు విచ్చేసిన నడ్డాను పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రవి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎన్నికల్లో ప్రతి నాయకుడు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

తాయిలాలతో ఓటర్లను కొనలేరు



బైక్ ర్యాలీలో బీజేపీ, జనసేన నాయకులు

- తాండూరులో విజయం మాదే
- జనసేన అభ్యర్థి శంకర్ గౌడ్

తాండూరు టౌన్: మద్యం పారిస్తూ.. డబ్బులు వెదజల్లుతున్న పార్టీలకు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో భంగపాటు తప్పదని జనసేన తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి నేమూరి శంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అన్ని వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడారు. తాయిలాలతో ఓటర్లను ఎవరూ కొనలేరని, ప్రజలకు సేవ చేసే వారెవరో తెలుసన్నారు. ప్రజా సమస్యలు తీర్చేందుకే బరిలో దిగానని, బీజేపీ మద్దతుతో విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు. అవినీతి రాజకీయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తానన్నారు. తెలంగాణలో అవినీతి పాలన అంతం కావాలంటే గాజుగ్లాసు గుర్తుకు ఓటేసి జనసేనను గెలిపించాలని కోరారు. ర్యాలీలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహు శ్రీలత, రజనీకాంత్, భద్రేశ్వర్, నరేష్, గోవింద్, జనసేన నాయకులు రవిపటేల్, రాము, అంబరీష్ ఉన్నారు.

జోరుగా వరికోతలు

- కూలీల కొరతతో యంత్రాలకు డిమాండ్
- జాడలేని కొనుగోలు కేంద్రాలు
- తక్కువ ధరకే దళారుల కొనుగోలు
- పెట్టుబడి రావడంలేదంటున్న రైతన్నలు



చింతపట్లలో యంత్రంతో వరికోత

యాచారం: ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో వరికోత పనులు జోరుగా సాగుతున్నాయి. రెండేళ్ల కింద కురిసిన సమృద్ధి వర్షాలతో ఆయా గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలకు కొదవలేదు. వానాకాలం కింద ఈ యేడు ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర మండలాల్లో 25వేల ఎకరాలకు పైగా రైతులు వరిపంటను సాగు చేశారు. సరిపడా నీరు ఉండటంతో పాటు.. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకపోవడంతో రైతులకు ఇబ్బందుల్లేవు. వరిపంట కూడా మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మండలంలోని రాయపోల్, దండుమైలారం, ముకునూర్, పోల్కంపల్లి, మంచాల మండలంలో మంచాల, ఆరుట్ల, జాపాల, లోయపల్లి, ఎల్లమ్మ తండా, బోడకొండ, రంగాపూర్, యాచారం మండలంలోని గునుగల్, చింతపట్ల, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, మాల్ తదితర గ్రామాల్లోని రైతులు వరిపంటను అత్యధిక ఎకరాల్లో సాగు చేశారు. అలాగే మిగిలా గ్రామాల్లో పత్తిని సాగు చేశారు.

యంత్రాలతోనే వరికోత..

గ్రామాల్లో వరి పంటను కోయడానికి కూలీల సమస్య తీవ్రంగా ఉంది. ఎన్నికల ప్రచారాలు జోరందుకోవడంతో కూలిలెవ్వరూ వరికోత పనులకు వెళ్లడం లేదు. పంట చేతికి రావడం, ఆలస్యం చేస్తే వడ్ల గింజలు నేలరాలిపోయే అవకాశం ఉండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. దీంతో రైతులు నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, కల్వకుర్తి తదితర ప్రాంతాల్లో ఉన్న వరికోత యంత్రాలను తెప్పించి పంటను కోయిస్తున్నారు. అన్ని గ్రామాల్లో పంట చేతికిరావడం, ఆలస్యం చేస్తే గింజలు రాలి నష్టపోయే అవకాశం ఉన్న నేపథ్యంలో డిమాండ్ దృష్ట్యా వరికోత యంత్రాల యజమానులు రేట్లను పెంచేశారు. గతేడాది గంటకు 1,500 మాత్రమే ఉండగా.. ఈ ఏడాది గంటకు రూ.2,500 నుంచి రూ.3వేలకు పైగానే రేట్లు పెంచారు. డీజిల్ రేట్లు, యంత్రాలు నడిపే డ్రైవర్ల జీతాలు కూడా పెరగడంతో కోతకు రేట్లను పెంచక తప్పడం లేదని యజమానులు అంటున్నారు. రైతులు మాత్రం ఎకరా వరిపంట సాగు కోసం రూ.25 వేలకు పైగానే ఖర్చు చేశామన్నారు.

ధాన్యం దళారుల పాలు

వరికోత పనులు జోరందుకున్నా అధికారులు మాత్రం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించకపోవడం రైతులకు శాపంగా మారింది. ప్రభుత్వం క్వింటాల్ ధాన్యం ఏ–గ్రేడ్‌కు రూ.2,203, సాధారణ గ్రేడ్‌కు రూ.2,183గా మద్దతు ధర నిర్ధారించింది. వరికోత పనులు ప్రారంభమైన వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే.. రైతులు వెంటనే కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి, విక్రయించే అవకాశం ఉంది. కానీ డివిజన్‌లో 14 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే అవకాశం ఉండగా.. నేటికి కేవలం 8 చోట్ల మాత్రమే ప్రారంభించారు. ప్రారంభించిన చోట్ల కూడా సరైన పర్యవేక్షణ లేకపోవడం వలన రైతులెవరూ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకరావడం లేదు. ఇప్పటికే వేలాది క్వింటాళ్ల ధాన్యం దళారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. క్వింటాల్‌కు రూ.1,550 నుంచి రూ.1,800 వరకే చెల్లిస్తూ వ్యవసాయ పొలాల వద్దకు వెళ్తున్న దళారులు నేరుగా లారీలు నింపుకుని వెళ్తున్నారు. దళారులు తక్షణమే డబ్బులు ఇవ్వడం వలన రైతులు వారికి ధాన్యం ఇచ్చేందుకు మొగ్గుచూపుతున్నారు. దీనికితోడు ప్రభుత్వకొనుగోలు కేంద్రాల్లో నాణ్యత, తరుగు పేరుతో ఇబ్బందులు పెడుతుండటం దళారులకు ధాన్యం విక్రయించడానికి మరో కారణంగా చెప్పవచ్చు.